## క్లుప్తంగా

### సర్వే వేగవంతం చేయండి


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలో చేపడుతున్న వర్క్ ఫ్రమ్ హోమ్, డోర్ టు డోర్ సర్వేలను వేగవంతం చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కంచరాం గ్రామంలో చేపడుతున్న సర్వేను ఆయన ఆదివారం పరిశీలించారు. మండలంలో 28,267 మందికి గాను 23,591 మందికి సంబంధించి, సర్వే చేశామని, మిగిలిన సభ్యుల సర్వేను పూర్తిచేయాలని సిబ్బందికి తెలిపారు.

### హోమ్ కంపోస్ట్ తయారీపై అవగాహన


కొత్తవలసలో అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలస, గాయత్రి కాలనీలో హోమ్ కంపోస్ట్ తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఇంట్లో వంటకు వినియోగించగా మిగిలిన కూరగాయల వ్యర్థాలు, కుళ్లిన పండ్లు, ఇతర వ్యర్థాలతో ఇంటి వద్దనే ఎరువు తయారు చేసుకోవచ్చని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. ప్రతిఒక్కరూ ఇంటి దగ్గరే ఎరువు తయారు చేసుకుంటే పెరటిలో కూరగాయలను సులభంగా సాగు చేసుకోవచ్చన్నారు.

### ఫారంపాండ్‌లు నిర్మించుకోవాలి


ఫారంపాండ్‌ల నిర్మాణం ప్రారంభిస్తున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: జీడిమామిడి తోటల్లో ఫారంపాండ్‌ల నిర్మాణం చేపట్టాలని ఏపీవో ఎస్.హరనాథరావు సూచించారు. మండలంలోని సంకిలి గ్రామ జీడిమామిడి తోటల్లో ఫారంపాండ్‌ల నిర్మాణాన్ని ఆయన సర్పంచ్ బుడుమూరు పట్టాభితో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఫారంపాండ్‌లు తవ్వుకోవడం ద్వారా వర్షపునీటిని ఒడిసిపట్టి తద్వారా భూగర్భజలాలను సంరక్షించుకోవచ్చన్నారు. అలాగే గిట్టుబాటు అయ్యే వేతనం కూడా లభిస్తుందన్నారు. మండలంలోని 30 పంచాయతీల్లో ఫారంపాండ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

రేగిడి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ తెలిపారు. స్థానిక విశ్వసాయి మందిరంలో ఆదివారం జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరైన ఆయన..కాసేపు ప్రసంగించారు. ప్రస్తుతం ప్రతిఒక్కరూ క్షణం తీరిక లేకుండా జీవితం గడుపుతున్నారని, రోజులో ఎంతో కొంత సమయం దైవ కార్యక్రమాలకు కేటాయిస్తే మానసికంగా ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు.

### రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు

రాజాం: సంతకవిటి-సిరిపురం ఆర్‌అండ్‌బీ రహదారి మరమ్మతులకు రూ.12 లక్షల నిధులు మంజూరయ్యాయని ఆర్‌అండ్‌బీ డీఈఈ కేవీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. రాజాంకు చెందిన ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ వారు ఈ రోడ్డు పనుల కాంట్రాక్ట్ దక్కించుకున్నారని, ఈ నెలాఖరులోగా పనులు చేయాల్సి ఉంటుందన్నారు.

### మండల సమావేశం రేపు

వంగర: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లోపింటి త్రినాథ్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరవుతారని, అభివృద్ధి నివేదికలతో అధికారులంతా హాజరు కావాలని కోరారు.

### సన్మానం

వంగర: స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాలలో బదిలీ ఎంఈవో యాగాటి దుర్గారావును పాఠశాల సిబ్బంది ఆదివారం సన్మానించారు. అనంతరం ఏడేళ్ల కాలంలో ఆయన విద్యాభివృద్ధికి చేసిన సేవలను ప్రశంసించారు.

- శిథిలావస్థలో మున్సిపల్ కార్యాలయం
- పెచ్చులూడుతున్న శ్లాబ్
- కొత్త భవనానికి నిధులు మంజూరు చేయని ప్రభుత్వం
- బిక్కుబిక్కుమంటూ ఉద్యోగుల విధులు

# అనుక్షణం.. భయం.. భయం..!


పాత పంచాయతీ భవనంలోనే కొనసాగుతున్న మున్సిపాలిటీకార్యాలయం

రాజాం: స్థానిక మున్సిపల్ కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉంది. ఎన్నో ఏళ్ల క్రితం పంచాయతీ కార్యాలయం నిమిత్తం నిర్మించిన భవనంలోనే ఇప్పటికీ మున్సిపల్ కార్యాలయం నడుస్తోంది. రాజాం.. పంచాయతీ స్థాయి నుంచి నగరపంచాయతీ.. ఆ తర్వాత మున్సిపాలిటీగా అభివృద్ధి చెంది ఏళ్లు గడుస్తున్నా పక్కా భవనం సమకూరలేదు. ఇప్పుడు మున్సిపల్ కార్యాలయ కొత్త భవనాలకు సరిపడ స్థలం ఉన్నా నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని భవనంలోనే ఉద్యోగులంతా బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.

#### ఇరుకుగా.. ప్రమాదకరంగా..


రాజాం ప్రధాన రహదారికి ఆనుకుని 2003లో రాజాం గ్రామ పంచాయతీకి పక్కా భవనాన్ని నిర్మించారు. 2005లో రాజాం, కొత్తవలస, పొనుగుటివలస, కొత్తవలస, సారధి పంచాయతీలను కలిపి రాజాం నగరపంచాయతీగా ఏర్పడింది. అప్పటినుంచి ఇప్పటివరకు మున్సిపల్ ఎన్నికలు ఇక్కడ జరగలేదు. పాలక మండలి కూడా ఏర్పాటు కాలేదు. 2003లో నిర్మించిన పాత పంచాయతీ భవనంలోనే ప్రస్తుతం మున్సిపాలిటీ సేవలు కొనసాగుతున్నాయి. ఈ భవనం ఇరుకుగా ఉండడంతో పాటు శ్లాబ్ మొత్తం పెచ్చులూడి ప్రమాదకరంగా తయారైంది. వర్షాకాలంలో భవనం


మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి గుర్తించిన స్థలం

మొత్తం కారిపోయి కార్యాలయం లోపల ఉన్న రికార్డులు తడిసిపోతున్నాయి. మరోవైపు విధుల్లోని ఉద్యోగుల తలల మీదనే ఒక్కోసారి పెచ్చులూడిపడే పరిస్థితి నెలకొంది. దీంతో ఉద్యోగానికి రావాలంటే ఉద్యోగులు భయపడుతున్నారు.

#### 19 సెంట్ల స్థలం గుర్తింపు..

రాజాం మున్సిపల్ కార్యాలయ కొత్త భవనం నిర్మాణానికి 19 సెంట్ల స్థలం గుర్తించారు. శ్రీకాకుళం రోడ్డులోని తహసీల్దారు కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో పక్కా భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. అన్ని కార్యాలయాల నిర్మాణానికి కలిపి రూ.3 కోట్లకు పైగా నిధులు అవసరం ఉంది. అయితే ఈ నిధుల మంజూరుకు అటు పాలకుల నుంచి గానీ ప్రభుత్వం నుంచి గానీ సానుకూలత లేకపోవడంతో మున్సిపల్ కార్యా


పెచ్చులూడిన శ్లాబ్

లయ కొత్త భవన నిర్మాణం కలగానే మిగిలిపోతోంది.

#### పక్కా భవనం అవసరమే..



రాజాం మున్సిపాలిటీకి పక్కా భవనం అవసరమే. ఈ మేరకు ఒకటి రెండు చోట్ల స్థల పరిశీలనలు కూడా జరిగాయి. స్థలం కేటాయింపుతో పాటు భవన నిర్మాణం నిమిత్తం నిధుల కోసం ప్రభుత్వాన్ని కోరుతున్నాం. నిధుల మంజూరు జరిగితే పక్కా భవనాల నిర్మాణం జరుగుతుందని ఆశిస్తున్నాం. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులపై అన్ని వార్డుల్లోని అడ్మిన్‌లు, వార్డు సచివాలయాల ఉద్యోగులతో రోజూ సమీక్షిస్తున్నాం.

–జె.రామప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్, రాజాం

## పరామర్శ


పరామర్శ అనంతరం సూర్యనారాయణ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామ ఎంపీటీసీ సభ్యుడు పిల్లా గౌరునాయుడు తండ్రి పిల్లా సూర్యనారాయణ ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు ఆ గ్రామానికి వెళ్లి, ఎంపీటీసీని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అనంతరం సూర్యనారాయణ అంత్యక్రియల్లో పాల్గొని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఎమ్మెల్సీ వెంట వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, వన్నలి, లక్ష్మీపురం, గుళ్ల


మెంటాడ: సర్పంచ్‌ను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

పాడు, చాటాయివలస సర్పంచ్‌లు గార రమణ, కెంబూరీ వెంకటేశ్వరరావు, వియ్యపు చక్రపాణి, కరణం గోవిందరావు ఉన్నారు.

మెంటాడ: మండలంలోని జక్కువ గ్రామ సర్పంచ్ లచ్చిరెడ్డి సత్యవతి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆదివారం ఆ గ్రామం వెళ్లి, సర్పంచ్ సత్యవతిని పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరాతీసి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, నాయకుడు లచ్చిరెట్టి అప్పలనాయుడు ఉన్నారు.

### యుద్ధప్రాతిపదికన తాగు నీటి బోర్ల మరమ్మతులు


ఎం.సీతారాంపురంలో బోరు బాగు చేస్తున్న దృశ్యం

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం, జగన్నాథవలస గ్రామంలో పాడైన తాగునీటి బోర్లు మరమ్మతులు ఆదివారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్యలు లేకుండా చేపట్టే క్రాస్‌ప్రోగ్రాంలో భాగంగా తాగునీటి వనరులను బాగు చేస్తున్నట్లు మెకానిక్‌లు తెలిపారు. ఎం.సీతారాంపురంలో ఐదు బోర్లు, జగన్నాథవలసలో ఒక బోరు బాగుచేశామన్నారు.

### • ‘ఉల్లాస్’ంగా పరీక్ష

గ్రామ గ్రామాన ఉల్లాస్(అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పరీక్ష ఆదివారం జరిగింది. అంగన్‌వాడీ కార్యకర్తల పర్యవేక్షణలో జరిగిన ఈ పరీక్షకు మహిళలు ఎంతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా హాజరై, అక్షరాస్యత అర్హత పరీక్ష రాశారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులను చేయడమే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమం పేరిట మహిళలకు విద్య నేర్పించారు. అనంతరం ఈ పరీక్ష చేపట్టారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్


రాజాం సిటీ: కంచరాం ప్రభుత్వ పాఠశాలలో ఎంపీడీవో శ్రీనివాసరావు పర్యవేక్షణలో పరీక్ష రాస్తున్న మహిళలు


వంగర: అరసాడలో ఉల్లాస్ పరీక్షకు హాజరైన అభ్యర్థులకు సూచనలిస్తున్న ఏపీఎం మంగమ్మ


బొబ్బిలి: పిరిడి గ్రామంలో ఉల్లాస్ పరీక్ష


బాడంగిలో పరీక్షను పరిశీలిస్తున్న అధికారులు


సంతకవిటి: గుళ్లసీతారాంపురంలో పరీక్ష రాస్తున్న మహిళలు

# ఇళ్లపట్టాలు ఇంకెప్పుడిస్తారు?

- మండల సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై సభ్యుల ఆగ్రహం


సమావేశంలో తహసీల్దారును ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు

రామభద్రపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దారు సులోచనరాణి తన నివేదికలు చదివి వినిపిస్తుండగా టీడీపీ నాయకుడు, రొంపల్లి గ్రామ ఎంపీటీసీ సభ్యుడు బవిరెడ్డి శంకరరావు జోక్యం చేసుకుని, పేదలకు ఇళ్లపట్టాలు ఇంకెప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ఇళ్లస్థలాల కోసం గ్రామస్తులు దరఖాస్తు చేసుకుని చాలా రోజులవుతోందని, ఇప్పటివరకు ఆ స్థలాలకు సంబంధించిన పట్టాలు ఎప్పుడిస్తారో స్పష్టత రాలేదన్నారు. ప్రభుత్వ స్థలాలు గుర్తిస్తున్నామని తహసీల్దారు సమాధానమిచ్చారు. ఏపీవో త్రినాథరావు తన నివేదికలు చదువుతుండగా రామభద్రపురం సర్పంచ్ లేచి నిలబడి ఉపాధి హామీ పథకం వేతనదారులకు కూలి గిట్టుబాటు కావడం లేదని, రోజుకు రూ.60 నుంచి రూ.100 మాత్రమే వస్తోందని కనీసం రూ.200 కూడా రాకపోతే రోజంతా పనిచేసేది ఎందుకు అని నిలదీశారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు జరిగిన చోట గిట్టుబాటు అయ్యే వేతనం పడుతోందని ఏపీవో తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ నివేదికలు వెల్లడిస్తుండగా స్థానిక ఎంపీటీసీ-3 మాట్లాడుతూ కనిమెరక, అగురు, యాత వీధుల్లోని కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించకపోవడంపై ధ్వజమెత్తారు. ఎలక్ట్రికల్ ఏఈ సత్యనారాయణ నివేదికలు చదువుతుండగా ఎంపీటీసీ సభ్యుడు బవిరెడ్డి చంద్రరావు లేచి స్థానిక కనిమెరక వీధిలో మూడు విద్యుత్ స్తంభాలు పూర్తిగా పాడైనా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ ఏఈ ప్రణయ మాట్లాడుతుండగా ఎంపీటీసీ తిరుపతినాయుడు లేచి ముచ్చర్లవలస చెరువు వద్ద బెర్ములు నిర్మించకుంటే వాహనాలు పడిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఏపీఎం నివేదికలు చదివే సమయంలో రొంపల్లి ఎంపీటీసీ సభ్యుడు బవిరెడ్డి శంకరరావు లేచి గ్రామంలో వెలుగు పరంగా స్కీమ్‌లకు సంబంధించి పబ్లిక్ సమావేశాలు పెట్టడం లేదని, స్కీమ్‌లు అమలవుతున్నాయో, ఏవిస్తున్నారో నాయకులకు తెలియకపోవడం దారుణమన్నారు. అనంతరం హౌసింగ్ ఏఈఈ రెడ్డి వేణు, ఎంఈవో తిరుమలప్రసాద్, ఏవో వెంకటయ్య తదితర అధికారులు తమ తమ నివేదికలు వెల్లడించారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈకి ఎంపీపీ లక్ష్మణరావు సూచించారు. అలాగే పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, ఎంపీడీవో రత్నం, వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

### సంచారం లేని వాహనాలు



రాజాం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి గతంలో టీడీపీ హయాంలో కేటాయించిన చంద్రన్న సంచార వైద్యశాల వాహనాలు ఇప్పుడు సంచరించకుండా అలానే పడి ఉన్నాయి. అప్పట్లో వీటిల్లో వైద్య సిబ్బంది గ్రామ గ్రామానికి వెళ్లి, అవసరమైన వారికి వైద్య సేవలు అందించేవారు. ఇప్పుడు ఆ వాహన సేవలేవీ కానరావడం లేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్నది కూటమి ప్రభుత్వం కావడం.. అందులో భాగస్వామిగా టీడీపీ ఉండడంతో ఆ వాహన సేవలు మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

–రాజాం

### దుర్గంధం వెదజల్లుతోంది..

వంగర మండలం, అరసాడ గ్రామంలో పారిశుధ్య లోపం కనిపిస్తోంది. ఏ వీధి కాలువ చూసినా పూర్తిగా నిండిన మురుగుతో దర్శనమిస్తోంది. అటువైపుగా వెళ్లే వారంతా కాలువల నుంచి వెదజల్లే దుర్గంధానికి ముక్కు మూసుకుని మరీ వెళ్తున్నారు. దోమలు కూడా విపరీతంగా పెరుగుతుండడంతో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి జ్వరాల బారినపడతామేమోనని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పారిశుధ్య పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–వంగర



### పాఠశాలలు తరలిస్తే ఊరుకోం..



పాఠశాలల విలీనం మానుకోవాలని ఏపీ విద్యార్థి జేఏసీ ప్రధాన కార్యదర్శి బి.సాయికిరణ్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయమై ఆయన బొబ్బిలిలో విలేకరులతో ఆదివారం మాట్లాడారు. ఎం.బూర్జివలస యూపీ స్కూల్‌లో 20 మంది విద్యార్థులు ఉన్నారనే నెపంతో ఆ పాఠశాలను పెంట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలపాలనుకోవడం సరికాదన్నారు. పాఠశాలల మెర్జ్(కలపడం) వల్ల విద్యార్థులు వ్యయప్రయాసలకు గురై, విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. తక్కువ మంది విద్యార్థులు ఉన్నారనే సాకుతో పాఠశాలలను తరలిస్తే ఊరుకోబోమని, పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టి అడ్డుకుంటామని హెచ్చరించారు. జీవో నంబరు 177 రద్దు చేసి, పాఠశాలలను రక్షించాలని కోరారు.

–బొబ్బిలి

# వీరుల త్యాగం వెలకట్టలేనిది..


రాజాం సిటీ: భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మానవతా సంస్థ సభ్యులు


బొబ్బిలి: జోహార్ భగత్‌సింగ్ అని నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

రాజాం సిటీ: దేశ స్వాతంత్య్ర సాధన కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా విడిచిపెట్టిన వీరుల త్యాగం వెలకట్టలేనిదని మానవతా సంస్థ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ కొనియాడారు. స్థానిక మానవతా సంస్థ కార్యాలయంలో స్వాతంత్య్ర సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహానుభావులను ఆదర్శంగా తీసుకుని, వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీవీ అచ్యుత్‌కుమార్, గట్టి పాపారావు, మక్క అప్పలనాయుడు, పెంకి చైతన్య కుమార్, ఆర్‌వీజే నాయుడు, దామోదరరాజ, శాసపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణంలోని లోకంబంధు రెసిడెన్సి, గిరిజన కళాశాల వసతిగృహంలో స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, ఏఐవైఎఫ్(ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్) సభ్యులంతా ఆయా కార్యక్రమాల్లో పాల్గొని, భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశ స్వాతంత్య్ర సాధనకు చేసిన కృషిని కొనియాడారు.

## ఆనాటి పరిస్థితులను అద్దంలా చూపేవి ఆత్మకథలు

రాజాం సిటీ: ప్రముఖ వ్యక్తులు రాసుకున్న ఆత్మకథలు ఆనాటి సామాజిక పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపే అద్దాల్లాంటివని ప్రముఖ సాహితీవేత్త రౌతు గణపతిరావునాయుడు అన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రారవే(రాజాం రచయితల వేదిక) 122వ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ‘ఉప్పల లక్ష్మణరావు ఆత్మకథ’ను ఆయన వివరించారు. బరంపురానికి చెందిన లక్ష్మణరావు, జర్మనీ దేశస్తురాలైన మిల్లీ షోలింగర్‌లు మంచి స్నేహితులుగా మారడం, ఆ తర్వాత జరిగిన వారి వివాహం గూర్చి చక్కగా వివరించారు. ఆదర్శ దంపతులుగా వారు దేశానికి చేసిన సేవ అభినందనీయమన్నారు. భారతదేశంలో జరుగుతున్న స్వాతంత్రోద్యమ విషయాలను మిల్లీ షోలింగర్ జర్మన్ భాషలో రాసి, జర్మన్ పత్రికలోనే ప్రచురింపజేసి ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టారన్నారు. డాక్టర్ ఆల్తి మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రారవే సభ్యులు గార రంగనాథం, ఒమ్మి రమణమూర్తి, పిల్లా తిరుపతిరావు, శాసపు సత్యనారాయణ, మూడడ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాహితీవేత్త గణపతిరావునాయుడు

### దుస్తుల పంపిణీ

బొబ్బిలిరూరల్: మండలంలోని నిమ్మలపాడు గిరిజన గ్రామంలోని నిరుపేదలకు వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాసు మాస్టారు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. మాజీ సైనికుల సంఘం గౌరవాధ్యక్షుడు మరడ రామినాయుడు చేతులమీదుగా 60 మందికి వస్త్రాలు అందజేశారు. పేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు.